క్లుప్తంగా

పరమ పావనం భగవద్గీత పఠనం



భగవద్గీతపై ప్రవచనం చెబుతున్న వైష్ణోకృప చైతన్య ప్రభు దాస్

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలని దీంతో పరమ పావనం చెందుతామని ఇస్కాన్ బాధ్యులు వైష్ణోకృప చైతన్య ప్రభు దాస్ అన్నారు. ఆదివారం ఇస్కాన్ జగన్నాథ మందిరంలో శ్రీల ప్రభుపాద విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం భగవద్గీతపై ఆయన ప్రవచనం చెప్పారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉత్తమ జీవితానికి భగవద్గీత మార్గదర్శనం అన్నారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన చేశారు. అనంతరం జగన్నాథ్‌కు మహారాజభోగ నివేదన చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

కర్నూలు (టౌన్): ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని టీడీపీ కర్నూలు జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆర్యవైశ్య ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మగాంధీ, పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆర్యవైశ్యులపై దాడులు పెరిగాయన్నారు. వైశ్యులంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్, నాయకులు నాగేంద్రకుమార్, నవీన్, ఫణీరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నైతిక భావాన్ని పెంపొందించాలి



విద్యార్థులకు నీతి కథలు వివరిస్తున్న స్వామిని సుప్రేమానంద

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో ఆధ్యాత్మిక నైతిక భావాన్ని పెంపొందించేలా జాగ్రత్తలు తీసుకోవాలని చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద సూచించారు. వీఆర్ కాలనీలోని చిన్మయమిషన్‌లో ఆదివారం బాల విహార్ నిర్వహించారు. విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, నీతికథలు వివరించారు. చదువుతో పాటు సంస్కారం నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కుటుంబం నుంచే విద్యార్థుల్లో భవిష్యత్తు తీర్చిదిద్దబడుతుందన్నారు. మంచి పౌరులను తయారు చేస్తే మంచి సమాజం నిర్మితమవుతుందన్నారు.

గుండెపోటుతో మాజీ సైనికుడి మృతి



డీసీబీ సాహెబ్

కర్నూలు(అర్బన్): నగరంలోని దేవనగర్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు డీసీబీ సాహెబ్ ఈ నెల 8వ తేదిన అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు నర్రా పేరయ్య, కార్యదర్శి సుధాకర్, కోశాధికారి నజీర్ అహమ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నావికాదళంలో విధులు నిర్వహిస్తు రిటైర్డు అయిన అనంతరం ఆయన బ్యాంకు మేనేజర్‌గా కూడా విధులు నిర్వహించారన్నారు. అనేక రకాల సేవా కార్యక్రమాల్లో ఆయన విశేషంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. సాహెబ్ మృతి పట్ల సంఘం సలహాదారులు కేసీ రాముడు, గడ్డం రామక్రిష్ణ, శేషిరెడ్డి తదితరులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

దరఖాస్తు చేసుకోండి

కోడుమూరు రూరల్: సదరం క్యాంపులు నిర్వహించే తేదీలకై అర్థోపెడిక్, కంటి, మానసిక వికలాంగులు సోమవారం నుంచి ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల చేత పరీక్షలు నిర్వహించేందుకు ఏప్రిల్, మే, జూన్ నెలల్లో తేదీలు కేటాయిస్తారన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : దసరా, రావణాసుర, మీటర్, ది పోప్స్ ఎక్సార్సిస్ట్, బలగం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : ది పోప్స్ ఎక్సార్సిస్ట్, మీటర్, దసరా, రావణాసుర
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సర్, దసరా, రావణాసుర
ఐనాక్స్ : ది పోప్స్ ఎక్సార్సిస్ట్, ది సూపర్ మారియో బ్రదర్స్, జాన్ విక్ చాప్టర్-4, రావణాసుర, భోలా
భరత్ కాంప్లెక్స్ : బలగం, దాస్ కా ధమ్కీ, దేశముదురు
శ్రీరామ : మీటర్
రాజ్ : రావణాసుర
విజయ : మీటర్

తీపి గుళికతో వైద్యం

- హోమియో వైద్యానికి పెరిగిన ఆదరణ
- పదేళ్లతో పోలిస్తే జిల్లాలో పెరిగిన రోగుల సంఖ్య
- జిల్లాలో 19 హోమియో డిస్పెన్సరీలు
- అన్ని చోట్ల ఉచితంగా చికిత్స, మందులు
- దీర్ఘకాలిక జబ్బులకు, మొండి రోగాలకు చక్కటి వైద్యం
- నేడు వరల్డ్ హోమియో డే



హోమియో వైద్యచికిత్సలో మందులు

కర్నూలు(హాస్పిటల్): ఏదైనా జబ్బు చేసిందంటే కషాయం తాగమంటే అబ్బో చేదు...మాకొద్దు అంటారు. ఇంగ్లిష్ మాత్ర వేసుకోమంటే గొంతులోకి దిగదు. నాకు వేసుకోవడానికి రాదని రకరకాల కారణాలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తారు. కానీ ఎలాంటి కారణాలు చెప్పడానికి వీలులేకుండా మందులు మింగే చికిత్స కేవలం హోమియో మాత్రమే అంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఈ మందులు ఇతర చికిత్సల్లా గాకుండా తియ్యగా ఉంటాయి. నోట్లో వేసుకోగానే కమ్మగా కరిగిపోతాయి. జిల్లాలో పాతికేళ్ల క్రితం ఇద్దరు, ముగ్గురు మాత్రమే ఈ వైద్యులు కనిపించేవారు. ఇప్పుడు ప్రతి నగరం, పట్టణంలో వీరు కనిపిస్తున్నారు. జర్మని దేశానికి చెందిన డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హనిమన్ మొదటిసారిగా హోమియో విధానాన్ని కనుగొన్నారు. ఆయన 1755 సంవత్సరం ఏప్రిల్ 10న జన్మించారు. అందుకే ప్రతి ఏటా ఏప్రిల్ 10వ తేదీన హోమియో డేగా పిలుస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో రెగ్యులర్, ఎన్‌హెచ్‌ఎం కలిపి మొత్తం 19 హోమియో డిస్పెన్సరీలు ఉన్నాయి. రెగ్యులర్‌గా పత్తికొండ, పోలకల్, కర్నూలు, వెల్దుర్తి, నంద్యాల, జిల్లెల్ల, డి.బెళగల్, చనుగొండ్ల, క్రిష్ణగిరి, ఆత్మకూరు, పగిద్యాల, నేషనల్ హెల్త్ మిషన్‌లో చాపిరేవుల, పెద్ద ఎమ్మనూరు, జోన్, ఉలిందకొండ, పెద్ద తుంబళం, సున్నిపెంట, ప్యాపిలి డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయా డిస్పెన్సరీలకు ప్రతిరోజూ 35 నుంచి 50 మంది వరకు కొత్తగా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. కర్నూలు, నంద్యాల, డోన్‌లాంటి చోట్ల ఓపీ రోగుల సంఖ్య దీనికి రెట్టింపుగా ఉంటోంది. అన్ని డిస్పెన్సరీలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచే ఉంటాయి. ఇక్కడ చికిత్స, మందులు పూర్తిగా ఉచితం. దీంతో పాటు కర్నూలు నగరంలో పలు కార్పొరేట్ సంస్థలు అడుగుపెట్టడంతో హోమియో వైద్యానికి మరింత క్రేజ్ ఏర్పడింది. నగరంలో 12 నుంచి 16 దాకా కార్పొరేట్ సంస్థల ఆసుపత్రులు ఉండగా, స్థానిక వైద్యులు జిల్లా మొత్తంగా 650 నుంచి 700 మంది దాకా చికిత్స అందిస్తున్నారు. మొత్తంగా సగటున ఏడాదికి 6 లక్షల మంది దాకా హోమియో వైద్యాన్ని అందుకుంటున్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు పరిష్కారం

హోమియో వైద్య విధానంలో దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆదరణ పెరుగుతోంది. ఇతర వైద్య విధానాల్లో నయం కాని వారు హోమియోకు వచ్చి చికిత్స తీసుకుని వ్యాధిని నయం చేసుకుని వెళ్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇందులో ప్రధానంగా నడుంనొప్పులు, ఆర్థరైటిస్, చర్మవ్యాధులు, తరచూ వచ్చే చీముగడ్డలు, గజ్జి, తామర, చెవిలో చీము కారడం, ముక్కుదిబ్బడ, గొంతునొప్పి, స్టాన్సిలైటిస్, నాజిల్ పాలిప్స్, గ్యాస్ట్రబుల్, మలబద్ధకం, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు, పసిరికలు, అమీబియాసిస్, నరాల సంబంధిత వ్యాధులు(సయాటిక, సర్వికల్ స్పాండిలోసిస్, లాంబార్ స్పాండిలైసిస్), కిడ్నీలో రాళ్లు వంటి దీర్ఘకాలిక సమస్యలకు హోమియో మందులు బాగా ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు



నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా హోమియో వైద్యానికి బడ్జెట్ పెంచారు. ఈ మేరకు ఇటీవల మందులు కూడా పుష్కలంగా వచ్చాయి. అన్ని డిస్పెన్సరీల్లో మందులు అందుబాటులో ఉంచాము. హోమియో డిస్పెన్సరీల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నాము. వరల్డ్ హోమియో డేను పురస్కరించుకుని అన్ని డిస్పెన్సరీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాము. అనంతరం వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందించి వ్యాధులపై అవగాహన కల్పించేలా ఏర్పాట్లు చేశాము. –డాక్టర్ టి.చంద్రశేఖర రెడ్డి, జిల్లా ఆయుష్ అధికారి, కర్నూలు

వ్యాధి మూలకారణం తెలుసుకుని చికిత్స



హోమియోపతి మందుల ద్వారా అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులను శాశ్వతంగా నయం చేయవచ్చు. ఈ మందుల వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవు. ఎలాంటి నొప్పి, ఆపరేషన్ లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించవచ్చు. ప్రధానంగా థైరాయిడ్, పీసీఓడీ, షుగర్, బీపీ, సొరియాసిస్ మొదలైన సమస్యలను హోమియో ద్వారా శాశ్వతంగా నివారించవచ్చు. రోగి మానసిక, శారీరక లక్షణాలు పరిగణనలోకి తీసుకుంటాము. తద్వారా వ్యాధి మూలకారణాన్ని కనుగొని రోగికి శాశ్వత పరిష్కారం అందించవచ్చు.
–డాక్టర్ రాజేంద్రప్రసాద్, హోమియోవైద్యులు, కర్నూలు

14న విషు మహోత్సవ పూజలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈ నెల 14వ తేదీన శ్రీ అయ్యప్ప స్వామి విషు మహోత్సవ పూజలు నిర్వహిస్తున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు పడి పూజ, పూలంకి సేవ, భజన, అల్పాహార ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. హరినారాయణ గురుస్వామి, జయశేఖర్ గురుస్వామిల బృందంచే ప్రత్యేక భజన ఉంటుందని తెలిపారు.

బకాయిలను విడుదల చేయాలి

కర్నూలు సిటీ: ఉపాధ్యాయులకు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లించాలని, సరెండర్ సెలవుల బకాయిలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను విడుదల చేయాలని ఏపీ ప్రధానోపాధ్యాయులు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఓంకార్ యాదవ్ కోరారు. ఆదివారం స్థానిక హెచ్‌ఎంల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పాఠశాలలకు స్కూల్ గ్రాంట్ పూర్తి స్థాయిలో ఇవ్వలేదన్నారు. పాఠశాలల పర్యవేక్షణ పోస్టులైన డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ-2 పోస్టులను ఉమ్మడి సీనియారిటీ ప్రాతిపదికన నియమించాలన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు నారాయణ, చంద్రశేఖర్, రమేష్, శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

12న క్యాంపస్ డ్రైవ్

కర్నూలు సిటీ: ఈ నెల 12వ తేదీన స్థానిక ఏక్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ డ్రైవ్‌లో బీఎస్సీ కెమిస్ట్రీ, బికామ్, బీఏ, ఐటీఐ, డిప్లమా మెకానికల్, బీ-ఫార్మసీ, ఎంఎస్సీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలైటికల్ కెమిస్ట్రీ) విద్యార్హతలు ఉన్న వారు పాల్గొనవచ్చునని ఆయన పేర్కొన్నారు.

ఏకాంతరామాలయంలో సంగీత కచేరి



కన్నడ భక్తిగీతాలు ఆలపిస్తున్న శ్రోతశ్విని

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని మెయిన్‌బజార్‌లో ఉన్న ఏకాంతరామాలయంలో హనుమజ్జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం కర్ణాటకలోని బీజాపూర్‌కు చెందిన సంగీత విద్వాంసురాలు శ్రోతశ్విని సంగీత కచేరి నిర్వహించారు. కన్నడ వాగ్గేయకారులైన పురంధరదాసు, విజయదాసు, కనకదాసు, భాగణ్ణదాసు భక్తిగీతాలను ఆలపించారు. అంతకుముందు ఉదయం 10.30 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 5గంటలకు సీతారామ, లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి స్వర్ణరథంపై ఊరేగారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మాళిగి రామ్మూర్తి ఆచార్య, కార్య నిర్వహణాధికారి దినేష్, మాళిగి విద్యానిధి ఆచార్య, వ్యాసరాజ్, జయతీర్థ, వేదవ్యాస్, భానుప్రకాశ్, ప్రభాకర్, విఠలశెట్టి, రాఘవేంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శిక్షణ



మాట్లాడుతున్న మౌలానా ఖాజి అబ్దుల్ మాజిద్

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర హజ్‌కు వెళ్లే యాత్రికులు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మౌలానా డాక్టర్ ఖాజి అబ్దుల్ మాజిద్ అన్నారు. ఆదివారం స్థానిక అబ్బాస్ నగర్‌లోని ఓ యూనిక్ స్కూలులో యాత్రికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా జరిగే హజ్-2023కు యాత్రికులు 40 రోజులు పాటు పవిత్ర మక్కా, మదీన ప్రాంతాల్లో ఆధ్యాత్మికంగా గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాత్రికులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: జిల్లాలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వివిధ పోటీ పరీక్షల కోచింగ్ సెంటర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవనంలో ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఇటీవలే ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తి కావడంతో నీట్/జేఈఈ పేరుతో అడ్డగోలుగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసుకొని లక్షల్లో ఫీజులు వసూలు చేసుకుంటున్నారన్నారు. కోచింగ్ సెంటర్లలో ఎలాంటి సదుపాయాలు లేవన్నారు. కొంత మంది ఇంటర్మీడియెట్ కాలేజీలకు అనుమతులు తీసుకొని కోచింగ్ సెంటర్లలో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. అదేవిధంగా కార్పొరేట్, సెమి కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు అనుమతులు తీసుకోకుండా హాస్టళ్లను నిర్వహిస్తూ ఫీజుల రూపంలో దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు రంగస్వామి, వెంకటేష్, మునిస్వామి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విన్సెంట్ ఫెర్రర్ జయంతి

తుగ్గలి: ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ జయంతిని ఆదివారం మండలంలోని బొల్లవానిపల్లి, జాప్లాతండాలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా హుండీలను తెరిచి పొదుపు చేసిన సొమ్మును ఆర్డీటీ ఏరియా టీం లీడర్ రెహనాకు అందజేశారు. ఏరియా పరిధిలో 145 గ్రామాల్లో ఫెర్రర్ జయంతి నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

హొళగుంద: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు గజ్జెహళ్లి కెంచప్ప, మల్లికార్జున అన్నారు. ఆదివారం గజ్జహళ్లిలో విన్సెంట్ ఫెర్రర్ 103వ జయంతి జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ.. ఫెర్రర్ చేసిన సేవలు, ఆర్డీటీ ద్వారా పేదలకు అందుతున్న పథకాలు తెలియజేశారు. సీబీటీ హెచ్‌పీ అంజినయ్య, సీడీసీ మెంబర్లు ఉలిగమ్మ, ఎలేసమ్మ, లింగమ్మ, లక్ష్మి, మారెమ్మ, పెద్ద కెంచప్ప, రామలింగ, ఈరప్ప తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని నెరుడుప్పల గ్రామంలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ జయంతి వేడుకలను ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఆర్డీటీ ఏటీయల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ విన్సెంట్ 'స్పందించు సాయమందించు' నినాదంతో సేవ చేశారన్నారు. స్పెయిన్ నుంచి వచ్చి వెనుకబడిన గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడు, గుడ్డ, నీడ, విద్య, వైద్యం అందించి అభాగ్యులైన వారిని ఆదరించి అనేక సేవలందించారని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఆర్డీటీ సిబ్బంది రామాంజినేయులు, సురేష్, సీడీసీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష విరమణ సందర్భంగా నిర్వహించిన ఇఫ్తార్ విందులో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ పాల్గొన్నారు. ఆదివారం స్థానిక వడ్డెగేరిలోని అహ్లె హదీస్ మర్కర్ మసీదులో మత పెద్దలతో కలిసి దువా చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ యూనుస్‌బాషా, హజ్ కమిటీ సభ్యుడు హాఫీజ్ మంజూర్, పార్టీ నాయకులు షఫీఖాన్, మహబూబ్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 16,17,18 తేదీలలో తిరుపతిలో జరిగే ఐఎఫ్‌టీయూ 7వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం మహాసభలకు సంబంధించి పోస్టర్లను వారు గోకారి భవన్‌లో ఆవిష్కరించారు. 16వ తేదీన భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, 17,18 తేదీల్లో ప్రతినిధుల సభలు ఉంటాయన్నారు. 17వ తేదీ ప్రారంభ ఉపన్యాసానికి ఢిల్లీ జేఎన్‌యూ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ హాజరు కానున్నట్లు చెప్పారు. కేంద్రంలో ఉన్న బీజేపీ కార్మిక, కర్షకుల సమస్యలను పట్టించుకోవడం లేదని, జాతీయ మహాసభల్లో వాటిపై లోతైన విశ్లేషణ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాజు, దేవేంద్రగౌడ్, సామేలు, బాష, రామ్ పాల్గొన్నారు.

చరిత్ర పాఠ్యాంశాలను మార్చడం తగదు

కర్నూలు సిటీ: నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చరిత్ర సబ్జెక్టులోని కొన్ని పాఠ్యాంశాలను మార్చాలనే ఆలోచన సరైంది కాదని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లాలు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. చరిత్రలోని కొన్ని అంశాలను భావితరాలకు తెలియకుండా చేయాలనే కుట్ర చేస్తున్నారన్నారు. మొగల్ సామ్రాజ్యం మొత్తం అధ్యయాలను, మహాత్మగాంధీ హత్య తదనంతరం ఆర్ఎస్ఎస్ నిషేధానికి దారి తీసిన పరిస్థితులకు సంబంధించిన కీలకమైన పాఠ్య భాగాలను తొలగించాలని చూస్తోందన్నారు. తక్షణమే సిలబస్ మార్చాలని తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శీను, అమర్, వీరాంజి, విజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈశ్వరయ్య వర్ధంతి

కర్నూలు కల్చరల్: టీజీవీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ హార్మోనిస్టు, నటులు సీమ సింహ బిరుదాంకితుడు ఉల్చాల డి.ఈశ్వరయ్య ప్రథమ వర్ధంతిని సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న యునైటెడ్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాకారులు, కళాభిమానులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

అట్రాసిటీ కేసు నమోదు

కర్నూలు (న్యూటౌన్): కల్లూరు మండలం తడకనపల్లెకి చెందిన షేక్ సలాంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఉలిందకొండ ఎస్ఐ నల్లప్ప వెల్లడించారు. తడకనపల్లెకి చెందిన వెంకటరాముడు కుమారుడు శ్రీనివాసులు ఆదివారం బస్టాప్ వద్ద టీ తాగేందుకు వెళ్తుండగా షేక్ సలాం కులం పేరుతో దూషించి దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి



నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): పేదలకు కూడు, గూడు కోసం పోరాటాలు చేసిన వ్యక్తిగా చంద్ర రాజేశ్వరరావు చరిత్రలో మిగిలిపోతారని సీపీఐ జిల్లాసహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. ఆదివారం ఒమెగా ఆసుపత్రికి సమీపంలో సీపీఐ చేపట్టిన భూ పోరాట స్థలంలో ఆయన 29వ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి జిల్లా సమితి తరపున పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జమీందారి కుటుంబంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు పేదల కోసం తన యావదాస్తిని దానం చేసి తుది శ్వాస వరకు పోరాటాలు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో భూ పోరాటాలు చేస్తూనే ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పి.రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్, నాగరాజు, కె.శ్రీనివాసులు, కుమార్, ఈశ్వర్, గిడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో ఆదివారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈస్టర్ పర్వదినం సందర్భంగా పబ్బతి నాగరాజు ఆర్థిక సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీలను నాగరాజు ప్రారంభించారు. గెలుపొందిన జట్టుకు రూ.10 వేలు నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రాంబాబు, రాజేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం సంఘ పెద్దలు కె.క్రిష్టఫార్, బొల్లారం స్వాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల పక్షాన ఎన్‌ఎస్‌యూఐ పోరాటం



జెండా విష్కరణ చేస్తున్న నాగమధుయాదవ్ తదితరులు

కర్నూలు(సెంట్రల్): విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎన్ఎస్‌యూఐ పోరాటాలు చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీసీసీ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ అధికారంలోకి వచ్చాక విద్య కాషాయి కరణ అవుతోందన్నారు. జాతీయ వాదులను తీవ్రవాదులుగా చిత్రీకరించి మతోన్మాదులను దేశ భక్తులుగా ప్రచారం చేయడం హేయమైన చర్య అన్నారు. మతోన్మాదాన్ని తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థగా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్‌యాదవ్, శ్రీనివాస్, జనార్ధన్,, మహేశ్వరయ్య తదితరులుపాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



గణేష్ నగర్‌లోని హోసన్న మందిరంలో ఈస్టర్ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



హోసన్న మందిరంలో..

కర్నూలు (టౌన్): కర్నూలు పట్టణంలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే రోజున శిలువ మరణం పొందిన ఏసు క్రీస్తు పునరుత్థానుడు కావడంతో ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోల్స్ సెంటీనియల్ తెలుగు బాపిస్టు చర్చి పాస్టర్లు జీవన్, సామేల్ బిషప్ చర్చి ఫాదర్ రెవరెండ్ అంతోనప్ప శౌరప్ప, యెహోవా చర్చి పాస్టర్ డాక్టర్ ప్రశాంతి శ్యామ్, యెరుషాలేమ్ చర్చి పాస్టర్ బ్రదర్ రూబేన్, గిప్సన్ సెంట్రల్ బాపిస్టు చర్చి పాస్టర్ కృపాదానం రాజు, సి.క్యాంపు ప్రార్థన మందిరం చర్చి పాస్టర్ రెవరెండ్ గంటా కరుణా సాగర్, దైవ సందేశకులు పాస్టర్ సజీవన్, సీఎస్ఐ చర్చిలో బిషప్ పుష్పాలలిత, హోసన్న మందిరం పాస్టర్ ఫ్రెడీపాల్ దైవ సందేశం ఇచ్చారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సీసీ చర్చి, సీఎస్ఐ చర్చి, స్టాంటన్ చర్చి, ఏలోహిమ్ చర్చి, బేత్లహేమ్ చర్చిలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు మార్గంలో నడవాలని చెప్పారు. ఆయా చర్చీల సంఘ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. అందరికి ఎమ్మెల్యే ఈస్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే టీడీపీ కర్నూలు నియోజక వర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్ ఆయా చర్చీలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు.



కోల్స్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న అనిల్‌కుమార్ సామేల్



కోల్స్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



సీక్యాంపు ప్రార్థన మందిరలో ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ సజీవన్



పార్థనల్లో పాల్గొన్న భక్తులు

ధనవంతుడు లాజరు నాటక ప్రదర్శన

కర్నూలు (న్యూటౌన్): ఈస్టర్ పండుగ సందర్భంగా కోల్స్ సెంటీనియల్ చర్చి ఆవరణలో ఆదివారం రాత్రి ధనవంతుడు లాజరు క్రైస్తవ ప్రదర్శన జరిగింది. ప్రభువు రాజ్యంలో ఎంత ధనవంతుడైన భక్తిలేకపోతే ప్రవేశించలేడు. సూది బెజ్జంలో ఏనుగు దూరవచ్చు కానీ క్రీస్తు రాజ్యంలో ధనవంతులకు అవకాశం లేదు. భక్తి మాత్రమే ప్రధానంగా అంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ నాటక ప్రదర్శన జరిగింది. ఇందులో వివిధ పాత్రలలో హెచ్ చంద్రన్న, ఎండీ క్రిష్టఫర్, మనోహర్‌బాబు, హసీనా, లక్ష్మణరాజు తదితరులు నటించారు. అనంతరం చర్చి గురువులు కళాకారులను ఘనంగా సన్మానించారు. లాజరు ధనవంతుడు నాటకాన్ని చూసిన ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా సాయిబన్నదాదా ఉరుసు

హొళగుంద: స్థానికులతో పాటు కర్ణాటక ప్రజల ఆరాధ్య దేవుడిగా వెలుగొందుతున్న హొళగుంద సాయిబన్న దాదా గంధం, ఉరుసు ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉరుసుకు తరలి వచ్చిన భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కుబడులను చెల్లించుకున్నారు. సంప్రదాయపద్ధతిలో శనివారం అర్ధరాత్రి మేల్‌మరే వంశీకులకు సంబంధించి మంచద మనే నుంచి గంధాన్ని గుర్రంపై ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు దారి పొడువునా కర్రలు, అగ్గి కాగడాలు తిప్పే విన్యాసాలు, బల ప్రదర్శనలు నిర్వహించి అబ్బురపరిచారు. రాత్రి భజన, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అబ్దుల్‌జహీర్, సిబ్బంది బందోబస్తు చేపట్టారు. సోమవారం జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.